# హోం సర్వీస్.. భారీ స్కాం

సరూర్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తి వయోభారంతో ఉన్న తన తల్లికి వ్యక్తిగత, వైద్యసేవలు అందించేందుకు ఒక వర్కర్‌ను నియమించుకోవాలనుకున్నాడు. జస్ట్ డయల్‌లో వచ్చిన సమాచారం మేరకు స్మార్ట్ ప్రో హోం హెల్త్‌కేర్ సర్వీస్‌ను ఆశ్రయించారు. కస్టమర్ నుంచి ముందుగానే నెలకు రూ.20-25వేల చొప్పున కొన్ని నెలల మొత్తాన్ని అడ్వాన్సుగా తీసుకున్న నిర్వాహకులు ఒక మహిళను కేటాయించారు. ఆమె రెండు నెలల పాటు సేవలు అందించి మానేసింది. ఇదేంటని అడిగితే.. నిర్వాహకులు తనకు రెండు నెలల జీతం ఇవ్వలేదని చెప్పింది. నిర్వాహకులను ప్రశ్నిస్తే మరో మహిళను కేటాయిస్తామని చెప్పి చేతులెత్తేశారు. పైసలైనా తిరిగి ఇవ్వాలని అడిగితే రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు.

జూబ్లీహిల్స్‌కు చెందిన ఒక వృద్ధ జంట బాగోగులు చూసేందుకు విదేశాల్లోని కుమారుడు ఇదేలీతిన ఒక సర్వీస్ సంస్థను ఆశ్రయించి, ఇద్దరు వ్యక్తులను నియమించుకున్నాడు. ఆర్నెల్ల పాటు నమ్మకంగా పనిచేసినవాళ్లు.. ఆ ఇంట్లో ఎక్కడ? ఏం ఉన్నాయి? అన్న వివరాలు తెలుసుకున్నారు. ఒకరోజు రాత్రి వృద్ధ దంపతులను బెదిరించి కాళ్లు, చేతులు కట్టేసి ఇంట్లో ఉన్న బంగారం, నగదును దోచుకుపోయారు. తీరా సదరు సంస్థను ఆశ్రయిస్తే తమకూ ఆ విషయం తెలియదని, వారి పూర్తి వివరాలు తమవద్ద లేవని చేతులెత్తేశారు.

## పుట్టగొడుగుల్లా బోగస్ హోం సర్వీస్ సంస్థలు

- కస్టమర్లు, వర్కర్లను దగాచేస్తున్న నిర్వాహకులు
- నెలకు రూ.లక్షల్లో మోసపోతున్న సామాన్యులు
- పర్యవేక్షణ లేక భారీగా పెరుగుతున్న దోపిడీలు
- అధికారిక గొడుగు కిందికి తీసుకొస్తేనే నియంత్రణ!

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 17 (నమస్తే తెలంగాణ): హోం సర్వీస్ అందించే సంస్థలపై ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవటంతో ఆ సంస్థల్లో జవాబుదారీతనం లోపించింది. పై రెండు ఘటనలే అందుకు సాక్ష్యం. హోం సర్వీస్ సంస్థలపై నిఘా, రికార్డుల నిర్వహణ లేకపోవటంతో సామాన్యుల అవసరాలతో ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నాయి. హోం సర్వీస్ ఇస్తామంటూ ఒక్కో కస్టమర్ నుంచి మూడు, నాలుగు నెలల అడ్వాన్స్ తీసుకొని ఒకటి, రెండు నెలలకే చేతులెత్తేస్తున్నాయి. అటు వర్కర్‌కు ఇవ్వకుండా, ఇటు కస్టమర్‌కు డబ్బులు తిరిగి చెల్లించకుండా ముఖం చాటేస్తున్నాయి. ఒక్కో కస్టమర్‌కు రూ.10-20 వేల వరకు మోసం చేసినా, అంతా కలిపి లెక్కేస్తే రూ.కోట్లలో అవుతుంది. కస్టమర్లు పోలీసులను ఆశ్రయించినా చిన్న కేసు అంటూ పక్కనపడేస్తున్నారు.

### అవసరాలే ఆసరాగా..

బిజీ జీవితంలో భార్యాభర్తలు ఉద్యోగాలు చేస్తేగానీ ఆర్థికంగా కుటుంబాలు ముందుకు పోయే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో చాలా కుటుంబాల్లో వృద్ధుల బాగోగులు చూసుకోవటం సవాల్‌గా మారింది. కొంతమంది వృద్ధాశ్రమాల్లో వదిలేసి చేతులు దులుపుకుంటున్నా, చాలామంది కన్నవారి రుణం తీర్చుకోవటం తమ కనీస బాధ్యతగా వారిని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా ఒక మనిషిని ఏర్పాటు చేస్తున్నారు. కొందరు వృద్ధులు అనారోగ్యం బారిన పడటంతో వారికి సమయానికి ఇన్సులిన్, ఇతరత్రా మందులు ఇవ్వటం, దినచర్యలు చేయించటం వంటి ప్రాథమిక వైద్య సాయం కోసం వర్కర్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. కొందరు పిల్లలను చూసుకొనేందుకు ఆయాలను నియమించుకుంటున్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు.. రాష్ట్రంలోని ప్రధాన పట్టణ కేంద్రాల్లో అనేక కుటుంబాలు వర్కర్లను నియమించుకుంటున్నాయి. దీంతో గల్లీకో హోం సర్వీస్ సెంటర్ పుట్టుకొచ్చింది. ఈ సంస్థల ఏర్పాటుకు సంబంధించి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నియమ నిబంధనలు, మార్గదర్శకాలు లేవు. అసలు ఏ శాఖ వద్ద వీరు అనుమతి తీసుకోవాలనేదానిపైనా అధికార యంత్రాంగం నుంచి స్పష్టత లేదు. దీంతో ఇష్టానుసారంగా ఈ సంస్థలు పుట్టుకొస్తున్నాయి. ఒక గది తీసుకొని, ముందు బోర్డు తగిలించుకొని తాము హోం సర్వీస్ అందిస్తామంటూ ప్రకటించుకుంటున్నాయి.

### కస్టమర్ల నుంచి ఆర్థిక దోపిడీ.. వర్కర్లతో శ్రమదోపిడీ

ఆర్థిక పరిస్థితి బాగాలేని కుటుంబాలకు చెందిన యువతులు, మధ్య వయసున్న మహిళలు ఎక్కువగా ఈ హోం సర్వీస్ అందించేందుకు ముందుకొస్తున్నారు. వీరిని హోం సర్వీస్ సంస్థలు నియమించుకొని.. అవసరం ఉన్నచోటుకు పంపిస్తున్నాయి. కొన్ని సంస్థలు గ్రామీణ ప్రాంతాల నుంచి మహిళల్ని తీసుకొచ్చి హోం సర్వీసును అందిస్తున్నాయి. హోం సర్వీస్ కోసం ఒక కస్టమర్ నుంచి నెలకు రూ.20-25 వేల చొప్పున నాలుగైదు నెలల మొత్తాన్ని ముందుగానే అడ్వాన్సుగా తీసుకుంటున్న సంస్థలు.. వర్కర్‌కు మాత్రం రెండు నెలలైనా జీతం ఇవ్వటం లేదు. సాధారణంగా సంస్థ కమీషన్ పోగా వర్కర్‌కు రూ.10-15 వేలు చెల్లిస్తారు. అంటే ఒక్కో వర్కర్‌పై నెలకు రూ.10-15 వేల వరకు కమీషన్ తీసుకుంటున్నారు. అయినప్పటికీ వర్కర్‌కు జీతం మాత్రం సరిగా ఇవ్వడం లేదు. దీంతో రెండు నెలల తర్వాత ఆ వర్కర్ అర్ధంతరంగా హోం సర్వీస్ నుంచి తప్పుకొని వేరే పని చూసుకుంటున్నారు. కస్టమర్లు నిలదీస్తే బోర్డు తిప్పేస్తున్నారు. మొత్తంగా ఒక్కో కస్టమర్ నుంచి దాదాపు రూ.80 వేలు జేబులో వేసుకుంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా సీరియస్‌గా తీసుకోకపోవటంతో బోగస్ హోం సర్వీస్ సంస్థల ఇష్టారాజ్యం అవుతున్నది. ఒక్కో సంస్థ 50 మందిని మోసగించినా ఆ మొత్తం రూ.40 లక్షల వరకు అవుతుంది. ఒక్క హైదరాబాద్‌లోనే వందల సంస్థలు బోర్డు తిప్పేస్తున్నాయి. ఆ మొత్తాన్ని లెక్కిస్తే కోట్లల్లో అవుతుంది. ఒక కస్టమర్ కోణంలో చూస్తే ఇది చిన్న మొత్తంగానే ఉన్నా, రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే ఈ దందా ఓ స్కాంలా తయారవుతున్నది. కొన్ని సంస్థలు నిజాయతీగానే సేవలు అందిస్తున్నా, లెక్కకు మించి సంస్థలు బోర్డు తిప్పేయటంతో బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతున్నది.

### నేరాల కోణంలోనూ మరో సవాల్

బోగస్ హోం సర్వీస్ సంస్థల వ్యవహారం ఆర్థికంగానే కాకుండా సామాజికంగానూ సవాల్‌గా మారుతున్నది. కొందరు సంస్థల నిర్వాహకులు, వర్కర్లు కుమ్మక్కై లూటీలు చేస్తున్న అవకాశాలూ లేకపోలేదు. విదేశాల్లో ఉండే పిల్లలు తమ తల్లిదండ్రుల బాగోగుల కోసం వర్కర్లను నియమిస్తున్నారు. దీంతో ఆ ఇంట్లో వృద్ధ దంపతులు మాత్రమే ఉంటారు. ఓ ఆర్నెల్ల పాటు నమ్మకంగా పని చేసే వర్కర్లు ఆపై వృద్ధులను మోసగించి, ఇంట్లో ఉన్న బంగారం, నగదు తీసుకొని ఉడాయించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా నిర్వాహకులు తమది ప్రేక్షక పాత్రే నని నమ్మిస్తున్నారు. హోం సర్వీస్ సంస్థలు ముందుగా అనుమతి తీసుకోకపోవటం, తమ వద్ద పనిచేసే వర్కర్ల వివరాలను పక్కాగా నిర్వహించకపోవటం, వారి గురించి ముందుగా విచారణ చేయించకపోవటం.. ఇలా అనేక కోణాల్లో వ్యవస్థ లోపభూయిష్టంగా తయారైంది. ఘటన జరిగిన తర్వాత విచారణ చేసినా పోలీసులు, నిర్వాహకుల వద్ద వర్కర్లకు సంబంధించిన పూర్తి వివరాలు లభించటం లేదు.

### అధికారిక ప్లాట్‌ఫాం ఏర్పాటుతోనే మేలు

హోం సర్వీస్ సంస్థల నమోదు, నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీ చేయాలని బాధితులు కోరుతున్నారు. సంస్థలు కచ్చితంగా సంబంధిత శాఖల నుంచి అనుమతి తీసుకోవటంతో పాటు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సంస్థ వివరాలు, అందులో పనిచేసే వర్కర్ల వివరాలను నమోదుచేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు. తద్వారా ఆర్థిక, సామాజిక కోణంలో ఏవైనా సమస్యలు వచ్చినపుడు పరిష్కారం సులువు అవుతుందని చెప్తున్నారు. అదేవిధంగా హోం సర్వీస్ సంస్థలపై పర్యవేక్షణ బాధ్యతను సంబంధిత శాఖకు అప్పగిస్తే బోగస్ సంస్థల బండారం బయటపడే అవకాశం ఉంటుంది. హైదరాబాద్‌లో హోం సర్వీస్ సంస్థల సేవలు కీలకంగా మారుతున్న తరుణంలో ప్రభుత్వ యంత్రాంగం ఈ వ్యవస్థపై దృష్టిసారించాల్సిన అవసరం ఉన్నది.

### మోసం జరిగితే ఫిర్యాదు చేయండి

హోం సర్వీస్ సంస్థలకు సంబంధించిన అనుమతులు, వాటి నిర్వహణపై పర్యవేక్షించే వ్యవస్థ ఇప్పటివరకు లేదు. సంస్థలు మోసం చేసినా, సర్వీస్ పేరుతో పనిలోచేరేవాళ్లు ఏమైనా నేరాలు చేస్తే పోలీసులు ఆయా ఫిర్యాదులపై కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేస్తుంటారు. మోసాలు, జరిగే నేరాలపై బాధితులు పోలీసులను ఎప్పుడైనా ఆశ్రయించవచ్చు. మోసం జరిగిన తర్వాత కేసు నమోదు చేయడం కంటే, ఇలాంటి సర్వీస్ సంస్థలు ఏర్పాటు చేసే వారు తప్పని సరిగా ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉంటుంది. కుటుంబ సంక్షేమశాఖ దీనిపై తగిన చర్యలు తీసుకొని నియమ నిబంధనలు పెడితే బాగుంటుంది.

– అవినాశ్ మహంతి, సైబరాబాద్ సీపీ

## దవాఖాన గెంటేస్తే.. 108లో పురుడు!

- గర్భిణిని చేర్చుకోని సర్కారు దవాఖాన
- 100 కిలోమీటర్ల ప్రయాణం తర్వాత ఇంట్లో మొదలైన నొప్పులు
- తిరిగి దవాఖానకు వస్తుండగా అంబులెన్స్‌లోనే ప్రసవం

అంబులెన్స్‌లో జన్మించిన బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఈఎంటీ కృష్ణవేణి

గుండాల, జూన్ 17: నిండు గర్భిణిని ప్రభుత్వ దవాఖానలో చేర్చుకోకపోవడంతో 108 వాహనంలోనే గర్భిణి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో ఆది వారం రాత్రి చోటుచేసుకుంది. పడుగోనిగూడెం పంచాయతీ నాగారాకి చెందిన కల్తి నవ్య నిండు గర్భిణి. శనివారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో భర్త సురేశ్ ఆదివారం ఉదయమే 108కు ఫోన్ చేయగా.. సిబ్బంది గుండాల పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ నవ్యను పరీక్షించిన పీహెచ్‌సీ వైద్యులు.. ఆమెకు ఇంకా నెలలు నిండలేదని, జిల్లా కేంద్రమైన కొత్తగూడెం దవాఖానకు తీసుకెళ్లాలని సూచించారు. అదే వాహనంలో కొత్తగూడెం చేరుకున్నారు. అక్కడి వైద్యులు సరిగా పరీక్షించకుండానే గర్భిణికి అంతా బాగుందని చెప్పారు. చేసేదేమీలేక అదే రోజు సాయంత్రం ఆర్టీసీ బస్సులో వంద కిలోమీటర్లు ప్రయాణించి మారుమూల ఏజెన్సీలో ఉన్న స్వగ్రామానికి చేరుకున్నారు. రాత్రి అయ్యాక పురిటి నొప్పులు మరింత ఎక్కువయ్యాయి. భర్త సురేశ్ మరోసారి 108 వాహనానికి ఫోన్ చేశాడు. మళ్లీ వచ్చిన 108 సిబ్బంది.. గర్భిణిని గుండాల పీహెచ్‌సీకి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యంలోనే పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. 108 వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి.. ఈఎంటీ కృష్ణవేణి గర్భిణికి కాన్పు చేసి పండంటి పాపకు పురుడుపోశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు.

## కూతురిని కాపాడబోయి..

- ఎల్ఎండీలో మునిగి తండ్రి మృతి
- అక్క, నాన్న కోసం దూకిన కొడుకు
- ముగ్గురూ మునగడంతో కేకలు
- పిల్లలను కాపాడిన మత్స్యకారుడు

విజయ్‌కుమార్

తిమ్మాపూర్, జూన్ 17: ఎల్ఎండీ అందాలను తిలకించేందుకు వెళ్లిన ఓ కుటుంబంలో విషాదం నిండింది. ప్రమాదవశాత్తూ నీటిలో పడ్డ కూతురిని కాపాడబోయి తండ్రి మృతి చెందిన ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో చోటుచేసుకున్నది. కరీంనగర్‌లోని సంతోష్‌నగర్‌లో నివాసం ఉండే బంగారి విజయ్ కుమార్ (47) కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వర్క్స్, ప్రాజెక్ట్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్. సోమవారం సెలవుకావడంతో భార్య ప్రశాంతి, కూతురు సాయినిత్య, కొడుకు విక్రాంత్, అత్త పుష్పలతతో కలిసి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని పొట్లపల్లి శివాలయానికి వెళ్లారు. తిరిగి వస్తూ ఎల్ఎండీ రిజర్వాయర్‌ను చూసేందుకు వెళ్లారు. కట్టపై నుంచి డ్యాంలోకి దిగి లోతుగా ఉండే కాకతీయ కాలువలోకి నీళ్లు వెళ్లే ప్రాంతంలో సరదాగా గడిపారు. బీటెక్ ఫస్టియర్ చదివే కూతురు సాయినిత్య సెల్ఫీలు దిగుతూ అదుపుతప్పి నీళ్లలో పడిపోయింది. తండ్రి నీళ్లలోకి దూకి కాపాడేందుకు ప్రయత్నిస్తూ మునిగిపోయారు. వారి కోసం టెన్త్ చదివే కొడుకు విక్రాంత్ సైతం దిగాడు. ముగ్గురూ మునిగిపోతుండటంతో కుటుంబసభ్యులు కేకలు వేశారు. సమీపంలో ఉన్న మత్స్యకారుడు శంకర్ వెంటనే వచ్చి నీటిలోకి దిగి పిల్లలను కాపాడి ఒడ్డుకు తీసుకొచ్చాడు. విజయ్ గల్లంతయ్యాడు. కొద్దిసేపటికే మృతదేహం పైకితేలి దొరికింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## ఈసెట్‌లో 8,982 సీట్ల భర్తీ

- తొలి విడత సీట్లను కేటాయించిన అధికారులు
- 21లోపు ఫీజు చెల్లించే అవకాశం

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ) : బీటెక్ కోర్సుల్లో ల్యాటరల్ ఎంట్రీ కోసం నిర్వహించిన టీజీ ఈసెట్ మొదటి విడత సీట్లను సోమవారం కేటాయించారు. తొలి విడతలో 13,965 సీట్లకు 8,982 (70%) సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది ఈసెట్‌లో 22,365 మంది క్వాలిఫై అయ్యారు. వీరిలో 12,757 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కాగా, 12,703 మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఎంచుకొన్నారు. సోమవారం సీట్లను కేటాయించగా, ఇంజినీరింగ్‌లో 8,951, ఫార్మసీలో 31 చొప్పున సీట్లు భర్తీ అయ్యాయి. ఈడబ్ల్యూఎస్ కోటాలో మరో 529 మంది సీట్లు దక్కించుకొన్నారు. ఇక వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరైనా 3,773 మంది విద్యార్థులు సీట్లను దక్కించుకోలేకపోయారు. సీట్లు పొందిన వారంతా ఈ నెల 21లోపు ఫీజు చెల్లించి, ఆయా కాలేజీల్లో రిపోర్టుచేయాలని సూచించారు.

### నేడు పీజీఈసెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ) : ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పీజీఈసెట్ ఫలితాలు మంగళవారం విడుదలకానున్నాయి. కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో మంగళవారం సాయంత్రం 4గంటలకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ఆర్ లింబాద్రి ఈ ఫలితాలను విడుదల చేస్తారని పీజీఈసెట్ కన్వీనర్ అరుణకుమారి తెలిపారు. ఈ నెల 10 నుంచి 13 వరకు పీజీఈసెట్ పరీక్షలను నిర్వహించారు. మొత్తం 22,712 మంది విద్యార్థులకు, 20,626 (90.82%) మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

**ఇంజినీరింగ్‌లో సీట్ల భర్తీ వివరాలు**

| యాజమాన్యం | విద్యాసంస్థలు | సీట్లు | భర్తీఅయినవి(శాతం) |
|---|---|---|---|
| యూనివర్సిటీ | 14 | 1,814 | 1,553 (85.6) |
| ప్రైవేట్ వర్సిటీ | 02 | 198 | 195 (98.5) |
| ప్రైవేట్ కాలేజీలు | 153 | 10,773 | 7,203 (66.6) |
| మొత్తం | 169 | 12,785 | 8,951 (70) |

# స్కూల్ అసిస్టెంట్లుగా పీఈటీలు

- గ్రేడ్-2 భాషాపండితులు కూడా..
- పదోన్నతి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం
- మల్టీజోన్-1లో 5,306 పండిట్లు, 1,057 పీఈటీల కల సాకారం
- గత కేసీఆర్ సర్కారులోనే అప్‌గ్రేడేషన్ నిర్ణయం
- ఉపాధ్యాయ సంఘాలు హర్షం

ఉద్యోగమేమో హైస్కూల్‌లో భాషాపండితుడు. 6-10 తరగతులకు బోధన. హోదా మాత్రం.. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ). వేతనంలోనూ వ్యత్యాసమే. ఉన్నత తరగతులకు చెప్పినందుకు రోజుకు ఇచ్చే భత్యం.. రూ.5 మాత్రమే. అదీ డీఈవో అనుమతిస్తేనే. సెలవుల్లో అదీ రాదు. 20-25 ఏండ్లుగా ఉన్నత తరగతులకు పాఠాలు చెప్తున్నా ఎస్సెస్సీ స్పాట్ వాల్యుయేషన్‌కు అనర్హులు. సమాన పనికి సమాన వేతనం అన్న రాజ్యాంగ సూత్రం వీరికి వర్తించదు. పైగా, 2001 తర్వాత హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్లు మాత్రమే బోధించాలన్న నిబంధన అమలు కాలేదు. దీంతో.. భాషాపండితులు ఎంతో వేదనను అనుభవించారు. కేసీఆర్ సర్కారు హయాంలో తీసుకొన్న నిర్ణయంతో ఆ అన్యాయానికి సోమవారం శుభంకార్డు పడింది.

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): దశాబ్దాలుగా అన్యాయానికి గురైన భాషా పండితులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా సోమవారం ఈ కీలక పరిణామం చోటుచేసుకున్నది. మల్టీజోన్-1లో 5,306 మంది భాషాపండితులు, 1,057 మంది పీఈటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. టీచర్ల నుంచి ఆప్షన్లు స్వీకరించిన ప్రభుత్వం ఆయా ఆప్షన్ల ప్రకారం పదోన్నతులు ఇచ్చి పోస్టింగ్స్‌ను జారీచేసింది. వీరంతా మంగళవారం పదోన్నతి పొందిన చోట విధుల్లో చేరుతారు. తాజా పదోన్నతులతో రాష్ట్రంలో గ్రేడ్-2 భాషాపండిత వ్యవస్థే రద్దయింది. ఇక నుంచి స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజ్)గా మాత్రమే ఆయా టీచర్లను వ్యవహరిస్తారు. ఈ నెల 22న మల్టీజోన్-2లోని వారికి పదోన్నతులు దక్కనున్నాయి. ప్రపంచ తెలుగు మహాసభల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి అప్పటి కేసీఆర్ సర్కారు పండితులు, పీఈటీ అప్‌గ్రేడేషన్ చేపట్టింది. సర్వీస్ రూల్స్ 11, 12ను సవరించి పండితుల కోసం జీవో 2, 3.. పీఈటీల కోసం జీవో 9, 10 జారీచేసింది. జీవో-110 ద్వారా 10,479 పోస్టులను అప్‌గ్రేడ్ చేసింది.

### ఉపాధ్యాయ సంఘాల హర్షం

పండిత్, పీఈటీ అప్‌గ్రేడేషన్ పట్ల పలు ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. ఇందుకు సహకరించిన ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపాయి. పదోన్నతి పొందిన వారికి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ (ఆర్‌యూపీపీటీ) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహ్మద్ అబ్దుల్లా, గుళ్లపల్లి తిరుమలకాంతి కృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. భాషా పండితుల జీవితాల్లో ఇదో సువర్ణ అధ్యాయమని అభివర్ణించారు. పదోన్నతుల్లో 8,630 మంది తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ, సంస్కృతం, కన్నడ భాషాపండితులు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందనున్నారని ఆర్‌యూపీపీ తెలంగాణ స్టేట్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు జగదీశ్, నర్సింహులు వెల్లడించారు. మరింత భాషాబోధన చేసి విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. అప్‌గ్రేడేషన్ ద్వారా భాషాపండితుల చిరకాల కలసాకారమైందని ఆత్మగౌరవాన్ని నిలబెట్టినవారందరికీ రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) రాష్ట్ర అధ్యక్ష ప్రధానకార్యదర్శులు చక్రవర్తుల శ్రీనివాస్, కర్రెం గౌరిశంకర్‌రావులు ధన్యవాదాలు తెలిపారు. పీఈటీల అప్‌గ్రేడేషన్ పట్ల పీఈటీ అసోసియేషన్ నేత విజయ్‌సాగర్ సైతం హర్షం వ్యక్తంచేశారు.

**జిల్లాల వారీగా పదోన్నతులు పొందినవారు (మల్టీజోన్-1)**

| జిల్లా | భాషాపండితులు | పీఈటీలు |
|---|---|---|
| ఆదిలాబాద్ | 220 | 25 |
| భద్రాద్రికొత్తగూడెం | 354 | 53 |
| హనుమకొండ | 192 | 61 |
| హైదరాబాద్ | 396 | 99 |
| జగిత్యాల | 333 | 56 |
| జయశంకర్‌భూపాలపల్లి | 135 | 31 |
| కామారెడ్డి | 380 | 78 |
| కరీంనగర్ | 227 | 61 |
| ఖమ్మం | 419 | 107 |
| కుమ్రంభీంఆసిఫాబాద్ | 166 | 18 |
| మహబూబాబాద్ | 245 | 48 |
| మంచిర్యాల | 229 | 33 |
| మెదక్ | 287 | 35 |
| ములుగు | 102 | 18 |
| నిర్మల్ | 192 | 32 |
| నిజామాబాద్ | 454 | 93 |
| పెద్దపల్లి | 199 | 36 |
| రాజన్నసిరిసిల | 187 | 40 |
| సిద్దిపేట | 367 | 74 |
| వరంగల్ | 222 | 59 |
| మొత్తం | 5,306 | 1,057 |

# బతుకు వెతలే కథలై..

- గిరిజన శ్రమైక జీవనంపై సాహితీ సేద్యం
- పదహారేండ్ల నుంచే కలం హలం
- విజయతీరాలకు చేర్చిన 'అక్షర'యజ్ఞం
- 26 ఏండ్లకే దక్కిన అరుదైన గౌరవం
- తండా నుంచి కేంద్ర పురస్కారం దాకా యువ సాహితీవేత్త రమేశ్ కార్తీక్‌నాయక్ ప్రస్థానం

రమేశ్ కార్తీక్ నాయక్

జూపల్లి రమేశ్ / నిజామాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తాను పుట్టి పెరిగిన తండాలో గిరిజనుల శ్రమైక జీవనం, వారి బతుకు వెతలు, సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాల సునిశిత పరిశీలన అతడి మనసును తట్టిలేపింది. పాఠశాల స్థాయి నుంచే 'అక్షర సేద్యం' చేసేలా తీర్చిదిద్దింది. తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతోడై కలమనే నాగలితో నూనుగు మీసాల వయస్సులోనే రచనలకు బీజం పడింది. గిరిజనుల జీవితాలపై అతడి రచనలు అనతి కాలంలోనే పుస్తకాలుగా ప్రచురితమై జాతీయ స్థాయిలో ప్రసిద్ధి పొందాయి. పాతికేండ్ల ప్రాయంలోనే ఎవరూ సాధించలేని ఘనతను సాధించిపెట్టాయి. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం వివేక్‌నగర్ తండాకు చెందిన రమేశ్ కార్తీక్ నాయక్, ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికవడం సాహితీప్రియులను ఆనందంలో ముంచెత్తింది. అతడు రాసిన వచన కవితా సంపుటి 'బల్దేర్ బండి'లోని 'జారేర్ బాటి (జొన్న రొట్టెలు)' కవిత కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ తెలుగు పాఠ్య పుస్తకంలో ముద్రితమైంది. 'బల్దేర్ బండి' సంపుటిలోని కవితలు ఏపీలోని ఆంధ్రా విశ్వవిద్యాయం పీజీ తెలుగు పాఠ్యాంశంలో చోటు దక్కించుకున్నాయి.

### పదో తరగతి నుంచే సాహిత్యసేవ

రమేశ్ కార్తీక్ నాయక్‌ది సాధారణ వ్యవసాయ కుటుంబం. నునావత్ మోజీరాం, సేవంతాబాయి దంపతులకు మొదటి సంతానం. 1997, డిసెంబర్ 14న జన్మించిన అతడి అసలు పేరు నునావత్ కార్తీక్. తెలుగు, ఇంగ్లిష్‌లో కథలు, వచనా కవిత్వం, అనువాదం వంటి విభాగాల్లో చిన్నతనంలోనే సాహితీవేత్తగా గుర్తింపు పొందాడు. పదో తరగతి నుంచే కవిత్వం రాయడం అలవాటుగా మార్చుకున్న కార్తీక్ నాయక్, గిరిజనుల జీవితాలు, మనస్తత్వాలు, కష్టసుఖాలను కవిత్వాలు, కథలుగా మలిచి ఆకట్టుకున్నాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు నిజామాబాద్ జిల్లాలోనే విద్యనభ్యసించాడు. బడిలో విద్యా సంబంధిత, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఓ వైపు రచనలను కొనసాగిస్తూనే మరోవైపు చదువుపై ఏకాగ్రత సడలనివ్వలేదు. మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమాలో చేరి, అది పూర్తికాకముందే బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి దూరవిద్యలో బీఏ పూర్తి చేశాడు. కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రైవేట్‌గా ఇంటర్ హెచ్ఈపీ, ఎంఎన్ఆర్ కళాశాలలో డీఎడ్ చదివి ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ నుంచి స్పానిష్ భాషలో డిప్లొమాలో చేరాడు. రెండో ఏడాదికి ఉత్తీర్ణత సాధించినా ఆర్థిక ఇబ్బందుల వల్ల కొనసాగించలేదు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఇంగ్లిష్‌లో ఎంఏ పూర్తి చేసిన అతడు, ప్రస్తుతం ఓయూలోనే ఎంఏ తెలుగు చదువుతున్నాడు. 2023లో ప్రైవేట్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకుడిగా పని చేశాడు. ప్రస్తుతం దూరదర్శన్‌లో 'అక్షరం' అనే సాహిత్య కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నాడు.

### ప్రతి రచనకూ ప్రజాదరణ

రమేశ్ కార్తీక్ నాయక్ రచనలు ఒక్కోటి ఒక్కో ప్రాధాన్యతతో ప్రజాదరణ పొందాయి. మొదటి కవితా సంపుటికి రమేశ్ 2014లోనే శ్రీకారం చుట్టాడు. తాను చూసిన సంఘటనలు, మనుషులు, సేకరించిన పుస్తకాల్లో ఉన్న అనేక విషయాలను తెలుసుకుని తొలి రచన పూర్తి చేశాడు. గిరిజన బతుకులు, వెతలనే కవితలు, కథలుగా చెప్పాలనుకున్నాడు. ఈ క్రమంలో రమేశ్ రాసిన 'బల్దేర్ బండి' కవితా సంపుటి 2018లో ప్రచురితం కాగా, 2019 జనవరిలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వచన కవితా సంపుటి సాహితీప్రియులను ఎంతగానో ఆకట్టుకున్నది. ఇంగ్లిష్, హిందీ, కన్నడ,